# అన్నయ్య



క్యాబిన్‌లో అడుగుపెట్టేవరకు ఆ ఉద్వేగాన్ని, ఆవేశాన్ని ఎలా అణచి అదుపులో ఉంచగలిగాడో రవణకే తెలియదు.

రాధ వేసిన ఆ ప్రశ్న పదేపదే వినిపించింది.

ఆ సమయంలో ఆమె మోము? ... కళ్లలో ఉన్న ఆ భావం? ...

తలుచుకుంటే రవణ తల రంగులరాట్నంలా గిరగిర తిరిగింది.

తను దాచిఉంచిన రహస్యాన్ని ఆమె ఎలా కనుక్కొంది? పెళ్లి అయిన రెండునెలలదాకా ఏమీ ఎరగనట్టు నటించి, ఈవేళ నెమ్మదిగా అడుగుతూంది!

'ఆ కంఠంలో పరిహాసం, ఎత్తిపొడుపు ఎంత మాత్రం లేవు' అని తన్ను తాను మరోసారి ఓదార్చుకున్నాడు.

టెలిఫోను రిసీవరు తీశాడు.

"నేను చాలా బిజీగావున్నాను ... కాల్సు వస్తే ఆఫీసులో లేనని చెప్పేయి. అంతగా అత్యవసరమని, వదిలించుకోటం వీలుకాదని తోస్తే సెక్రటరీకిచ్చేయి."




అన్నాడు ఆపరేటరుతో.

కాలింగ్ బజ్జర్ నొక్కాడు.

ప్యూను ఎదురుగా వచ్చి నిలబడి సలాం పెట్టాడు.

"సెక్రటరీని పిలు."

అతనుకూడా వచ్చాడు.

"ఈవేళ నాకు ఒంట్లో బాగాలేదు. అప్పాయింట్‌మెంట్లన్నీ రద్దుచేసేయి. పన్నెండుగంటలకున్న సెమినార్‌కుమాత్రం వెడతాను. నా రిపోర్టు చదవవలిసి ఉంది, తప్పించుకోలేను."

సెక్రటరీ ఏదో అడగబోయి అతనివంక ఓ క్షణం చూసి, మనసు మార్చుకొని వెళ్లిపోయాడు.

అసలు ఆఫీసుకు రాకూడదనుకున్నాడు. కాని, ఇంట్లో ఉంటే రాధ ఇంకా ఏం ప్రశ్నలు వేస్తుందో?... తను ఏం జవాబు చెప్పాలో తెలియక తికమకపడతాడు.

సిగరెట్టు వెలిగించి కాబిన్ కిటికీలోంచి దూరంగా కనిపిస్తున్న సముద్రంవంక పరధ్యానంగా చూశాడు. ఆ ఉదయం మామూలుగా రాధకు "టాటా" చెప్పి బయలుదేరబోతూంటే, "ఏమండీ! ... నేను ఒక్కమాటడుగుతాను. కోపగించుకోరు కదా?" అంది.

"ఒక్కటేమిటి? . . . లక్ష అడుగు. . . అవసరమైతే ఆఫీసుకు పంగనామాలుపెట్టి నీముందు కూర్చుని అన్ని ప్రశ్నలకు జవాబు చెబుతాను. . . అంతకంటె వేరే భాగ్య మేముంది?" అన్నాడు నవ్వుతూ. పెళ్లిఅయిన కొత్త, కొండమీది కోతిని తెమ్మన్నా తప్పదు.

"అత్తయ్యను చూశానుకాని, అన్నగారి నింకా చూడలేదు. . . ఓమారు చూసివద్దామా?. . . రెండు రోజులు వరసగా సెలవులు వస్తున్నాయి కదా?. . . అన్నగారి ీ ..లు అందుకోవద్దూ?"

రవణ కొయ్యబారిపోయాడు. మనసులో ఏదో ఉంచుకుని, పైకి కనపడనీయక, మభ్యపెడుతున్నట్టుంది ఆ మాట. 'అన్నయ్యను గురించి ఆమెకెలా తెలిసింది?'

"దాని కిప్పుడు తొందరేం వచ్చిందిలే! ... వెళ్లచ్చు" అని కదలబోయాడు.

"అలాక్కాదండి! ... కొత్త జీవితం మొదలుపెట్టేముందు పెద్దల ఆశీర్వాదం పొందితీరాలి. మిమ్మల్ని ఈ స్థితికి తీసుకువచ్చింది ఆయనే కదా? ... అందుకని. . ."

రవణ ఏం జవాబు చెప్పాలో తెలియక అయోమయంగా చూశాడు.

"మీ మనసులో ఉండే బాధ నాకు తెలుసు. మీరు చెప్పకపోయినా అన్ని సంగతులూ కనుక్కున్నాను."

రవణ నెత్తిన పిడుగు పడినట్టయింది.

ఎలాగో తమాయించుకుని, "సరే! ... నాకు టైమవుతూంది. సాయంత్రం మాట్లాడుకుందాం" అని అప్పటికి తప్పించుకుని కార్లో కూర్చున్నాడు. ఆఫీసు వచ్చిందని డ్రైవరు తెలియజేసేదాకా అతనికీ లోకపు చింత లేదు.

తనలో చెలరేగే అశాంతిలా సముద్ర తరంగాలు ఎగిరిపడ్డాయి.

'ఇంతకూ రాధ అన్న మాటల్లో తప్పేముంది? తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా, స్వతంత్రంగా వెలువరించే హక్కు ఆమెకుంది. తనుమాత్రం

అన్నయ్యను అసహ్యించుకున్నాడా? లేదు.'

వెక్కి వెక్కి పరిగెత్తింది మనస్సు.

• • •

నాన్న పోయేసరికి తనకు ఏడేళ్ళు. అన్నయ్యకు పధ్నాలుగు.

అమ్మ, అన్నయ్య ఏడ్చారు. అన్నయ్యకంటె అమ్మ ఎక్కువగా గుండెలు బాదుకుని రోదించింది. పెద్ద వాళ్ళు ఎక్కువగా ఏడవాలనుకున్నాడు.

చదువు ఒంటబట్టని కారణంచేత అన్నయ్య అయిదో క్లాసులో ఉన్నాడు. రెండు వారాలు గడిచినా అన్నయ్య స్కూలుకు వెళ్ళలేదు. అతని కర్తవ్యమవుతుందని అమ్మ కారణం వివరించింది.

"నాన్న తన కుటుంబంకోసం చిల్లిగవ్వైనా కూడబెట్టలేదు. ఈ ఇల్లు తప్పించి మన కెలాంటి ఆస్తీ లేదు. అందుచేత కష్టపడి పనిచేస్తేతప్పించి తిండి దొరకదు. ఏమో! . . . రవణకూడా చదువు మానుకోవలసివస్తుందేమో! పుస్తకాలు, బట్టలు, స్కూలుజీతం — అన్నీ ఎక్కణ్ణించి వస్తాయి?"

ఆ మాటలన్నీ విన్న అన్నయ్య మండిపడ్డాడు.

"నువ్వా చిన్నపిల్లవాడి మనసు పాడుచేయకు. వాడు బుద్ధిమంతుడు. చక్కగా చదువుకుంటున్నాడు. అప్పుడే ఇంగ్లీషు పుస్తకాలు చదివేస్తున్నాడు. కొన్నాళ్ళ క్రితం వాడి మేస్టారు కనిపించి ఎంతో పొగిడారు. పైకివచ్చే లక్షణా లున్నాయన్నారు. వాడికి నేనున్నాను. నా శక్తివంచనలేకుండా సాయం చేస్తాను. నాకూ, చదువుకూ పొత్తు కుదరదు."

అమ్మ కన్నీరు తుడుచుకుని ఇద్దరిని కౌగలించు కుంది.

ఆ సాయంత్రం పరమానందం వచ్చారు.

"చెల్లాయ్! ఏడిస్తే ఏం లాభమమ్మా? నుదుట ఏం రాసిఉంటే అది జరుగుతుంది. పెద్దవాణ్ణి నా వెంట పంపు. చేదోడువాదోడుగా ఉంటాడు. రెండు డబ్బులు చేతిలో పడతాయికూడా. నీ కొడుకును ఈ లైనులో దింపుతున్నానని కోపగించుకోకు. నా చేత నైన సాయం ఇంతే. తరవాత నీ ఇష్టం."

అప్పట్లో అమ్మ జవాబుచెప్పక మౌనంగా ఉండి పోయింది.

ఆ మరునాటినుండి —

మాసిన పంచె, దానికి తీసిపోని అంగవస్త్రం, వారం రోజులుగా పెరిగిన గడ్డం, బట్టతలమీద అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు, చేతిలో గరిటె, అట్లకాడ—అలా పరమానందం సైన్యాధిపతిలా ముందు నడిచిపోతుంటే, ఆయన్ని నీడలా వెంబడించే అన్నయ్యను చూసి అమ్మ కుంగిపోయేది. కలలో కూడా ఆమె ఊహించని భవిష్యత్తు అతన్ని వరించింది.

ఆ ఊళ్ళో పరమానందాన్ని ఎరగనివారు లేరు. నలభీములుకూడా ఆయనకు వంగి వంగి సలాములు చేయవలసిందే. ఎక్కడైనా పెళ్ళి, ఉపనయనం, సీమంతం, టీపార్టీ — ఏదైనాసరే — ఉన్నట్టయితే పరమానందం అక్కడ హాజరు. ఆ ఒక్కవేళలో మాత్రం ఎంతటి శ్రీమంతుడయినా అతని చేతిలో కీలుబొమ్మ. విందు ఆరగించినవారు కనీసం నెల రోజులదాకా ఆయన్ని మరిచిపోయేవారుకారు. కాల క్రమేణ అన్నయ్యకూడా ఈ పనిలో దిట్ట అనిపించు

న్యాయానికి కట్టుబడి చేసే ఏ వృత్తి అయినా గౌరవప్రదమైనదే. హెచ్చు తగ్గులు మనం కల్పించుకునేవి. ఆకాశంవరకూ మెట్లుంటూ ఉంటే, పై మెట్టుకు కింది మెట్టు ఎప్పుడూ లోకువే...

కున్నాడు.

అలసి సొలసి ఇంటికి తిరిగిరాగానే రవణను ఎన్నో అడిగే వాడు. ఆనాడు క్లాసులో ఏం పాఠం?... క్లాసులో ఎవరైనా కొట్టారా?... మేస్టారు ఏమన్నారు?... ఏమైనా క్లాసుపరీక్షలు జరిగాయా?... మార్కులెలావచ్చాయి?.. ఆవేళ ఇంట్లో వంటేమిటి? — ఇలా కోటిప్రశ్నలు. ఒక్కోసారి అన్నయ్య ఇంటికి రావటం ఆలస్యమైతే రవణ అరుగుమీద కాసుకుని కూర్చునేవాడు. అమ్మ ఎంత బతిమాలినా, మందలించినా పడుకునేవాడు కాడు. ఆ అనుబంధం నానాటికీ బలిసింది. ప్రతి రోజూ తినేందు కేదైనా తెచ్చేవాడు. తీరిక ఉన్నప్పుడు సినిమాలకు తీసుకుపోయేవాడు.

ఒకసారి రవణకు సిల్కుచొక్కా కుట్టిస్తే వద్దని తిరస్కరించాడు. అన్నయ్య కారణం అడిగాడు.

"అన్నీ నాకేనా? మరి నీకేమీ అక్కర్లేదా? నువ్వు మాత్రం చిరుగు పంచెలు కట్టుకుంటున్నావ్. నీకున్నదల్లా ఆ ముతక గళ్ళచొక్కా ఒక్కటేగా?..."

"నా కెందుకురా? . . . త్వరగా మాసిపోతాయి. నువ్వు స్కూలుకి పోయేవాడివి. మంచి బట్టలు వేసుకుని, దర్జాగా ఉండకపోతే అందరూ వెక్కిరిస్తారు. నాకు ఒక్కటే చొక్కా ఉందని ఎవరన్నారు? ఆ పెట్టె నిండా బోలెడున్నాయి" అని నర్దిచెప్పాడు.

అలా రోజులు, నెలలు పరిగెత్తాయి.

స్కూల్లో అందరూ అతన్ని ఎగతాళి చేసేవారు.

"ఒరేయ్, రవణా! మీ అన్నయ్య రుచిగా, తాజాగా జిలేబీలు, లడ్డూలు, మైసూరుపాకాలు చేస్తాడుకదా! మాకు ఒక్క ముక్కయినా పెట్టకుండా అన్నీ నువ్వే తినేస్తున్నావ్. ఏం బాగాలేదు" అని ఓ కుర్రాడు తీవ్రంగా అనేవాడు.

"అబ్బే! నాకు తీపిపదార్థాలంటే అసలు కిట్టదు. కాస్త మిక్చరు తీసుకురా చాలు" అని మరొకడు 'తందానా' పాడేవాడు.

తతిమా కుర్రాళ్ళంతా గొల్లుమనేవారు.

రవణ ఎవరికీ ఏమీ జవాబుచెప్పక లోలోన మథన పడేవాడు. వంటవాడి తమ్ముడుగా ఉండటంలో తప్పే ముందో అతని లేతమనసు తరిచిచూసి అర్థం చేసుకోలేకపోయినా, అదేదో అగాధంలో నడవటం లాంటిదని గ్రహించాడు.

"అన్నయ్యకూడా అందరికిమల్లే ఏ గుమాస్తా గానో, ఆఫీసరుగానో ఎందుకుండకూడదు?" అని ఎన్నోసార్లు తన్ను తాను ప్రశ్నించుకున్నాడు.

ఒక్కొక్కప్పుడు క్లాసులో మరో తమాషా జరిగేది. ఓ విద్యార్థి స్కేలు గరిటెలా పట్టుకుని, "చిత్తం!

ఆర్. యం. చిదంబరం

రేపేనండి పెళ్ళి? . . . తప్పకుండా అరింటికే హాజ రవుతాను... అయ్యో! తమరు వేరే చెప్పాలా?" అంటూ అన్నయ్య నటిస్తూ క్లాసుగదిలో ఆ చివరనుండి ఈ చివరికి నడుస్తాడు. తతిమా విద్యార్థులంతా చప్పట్లుచరిచి, కోలాహలంగా ఈరి గంతులువేస్తారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో!

అందులోనూ, అతడు బాగా చదువుకునేవాడు కనక, మరింత కసిగా ఏడిపించేవారు. కారులో పది హేను నిమిషాలు ఆలస్యంగా యువరాజులా వచ్చి దిగి, టెరిలిన్ చొక్కా, పాంటు ఎక్కడ మాసిపోతుందోనని భయపడుతూ, ఖరీదైన షూలు తళతళమంటూంటే, బంట్రోతు వెనకాల పుస్తకాల పెట్టె మోసుకు వస్తూంటే దర్జాగా క్లాసులో అడుగుపెట్టే శ్రీమంతు లకు ఓ వంటవాడి తమ్ముడు తమకంటె పదిరెట్లు, వందరెట్లు మార్కులు ఎక్కువ సంపాదిస్తున్నాడంటే కోపం రాకుండాఉంటుందా?

రవణకు అన్నయ్యమీద ఆకాశమంత అనురాగం. కాని, అతని వృత్తిమీద జుగుప్స, అసహ్యం.

ఆలోచనకు బ్రేక్ పడింది. కాబిన్ తలుపు తెరుచు కుంది. కాంటీన్ బోయ్ ట్రేలో కాఫీ తీసుకు వచ్చాడు.

"తలనొప్పిమాత్రకూడా తీసుకురా! .. తలనొప్పిగా ఉంది" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

రవణ తిరిగి ఆలోచనలో పడ్డాడు.

రాష్ట్రానికంతకీ - మొదటివాడుగా స్కూలుఫైనలు పాసయ్యాడు. అన్నయ్య ఆనందానికి అంతులేకపోయింది.

"అన్నయ్యా!... నువ్వు కష్టపడింది చాలు. నేను ఉద్యోగప్రయత్నం చేస్తాను. ఫస్టు వచ్చాను గనక, తప్పకుండా దొరుకుతుంది."

"అవున్రా! ఇలా ఎంతకాలం నేనుమాత్రం వండి పెట్టగలను? నీ బాధ్యత నెరవేర్చుకున్నావు. రవణ పెద్దవాడయ్యాడు. ఇంక వాడి దారి వాడు చూసు కుంటాడు. నువ్వో ఇంటివాడివైతే చూడాలన్న ఒక్క కోరికమాత్రం మిగిలిపోయింది" అంది అమ్మ.

అన్నయ్య పెద్దగా నవ్వాడు.

"నువ్వు వట్టి అమాయకుడివోయ్! ఈ చిన్న వయస్సులో నీకు లోకం అంటే ఏం తెలుస్తుంది? అయిదువందలు వస్తేనే గడవటం కష్టంగా ఉండే ఈ రోజుల్లో మూటయాభై రూపాయల గుమాస్తాగా జీవితంలో స్థిరపడటంకంటె తెలివితక్కువతనం మరొకటి ఉండదు. నువ్వు బుద్ధిమంతుడివి. బాగా చదువుతున్నావు. అందుచేత నీ ఆశయాలు కొంచెం పెద్దవిగా ఉండాలి. నేనుండగా నీకు ఏ విషయం లోనూ చీకూ, చింతా ఉండదు. కాలేజీలో చేరి చదువు."

"వద్దు... వద్దన్నయ్యా! నువ్వు నాకోసం చేసిన త్యాగం చాలు. నేనింక చదవదలచుకోలేదు. ముందు అమ్మ కోరిక పూర్తిచేయి."

అన్నయ్య ముందుకువచ్చి అతని భుజం తట్టాడు.

"నీ బాధ నాకు తెలుసు. కాని నేను మొదలుపెట్టిన ఓ మంచి పని మధ్యలో ఆపటం న్యాయంకాదు. నువ్వే ఆలోచించు. మరో నాలుగు సంవత్సరాలు చదివితే డిగ్రీ వస్తుంది. ఇంతకాలం ఆగాను. మరి కొన్నాళ్ళు ఆగితే ముసలాణ్ణి అయిపోను. నా మాట కాదనకు."

జవాబుకోసం ఎదురుచూడకుండా అక్కణ్ణించి కదిలి

ఋతుక్రమం అలస్యమైతే?

SEENU & CO. MADRAS-21

పెద్ద తెమిష్టులు, డ్రగ్గిస్టులు అందరి ఎద్దను లభిస్తున్నది

ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది

"మీ పాపాయికి ప్రత్యేకమైన పౌడరు కావాలి, కాల్గేట్ ఎంతో దివ్యమైనది!"

కాల్గేట్ బేబీ పౌడరు అతి చక్కనిది, ఎక్కువగా పీల్చుకొంటుంది, పిల్చుకొనే మృదువైనది; అది పసి చర్మాలను పొట్టు రేగకుండా, చికాకులు కలగకుండా రక్షణయిస్తుంది, పాపాయికి చల్లని హాయినీ, సుఖమునూ చేకూరుస్తుంది! మీ పాపాయికి కాల్గేట్ బేబీ పౌడరు యీరోజే కొనండి!






CBP G 7 TEL

పోయాడు.

రవణ తల్లికేసి చూశాడు.

"అంతే, రవణా! తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు. వాడి తత్త్వం తెలిసిందేగా? ఇంక ఎంత నచ్చచెప్పినా వినిపించుకోడు. మరీ విసిగిస్తే ఇంటి ముఖం చూడడు. ఏం చేయటం?" అని నిట్టూర్చింది.

రవణ కాలేజీలో చేరాడు.

మొదట్లో మథనపడ్డా 'నాలుగు సంవత్సరాలేకదా!' అని సముదాయించుకున్నాడు. తనకో అన్నయ్య ఉన్న ట్లు అతను కాలేజీలో ఎవరితోనూ చెప్పలేదు. స్కూల్లో అనుభవాలు మరుపురానివిగా ఉండిపోయాయి. కాలేజీలో విద్యార్థుల మనస్తత్త్వం, ప్రవర్తన అన్నీ అతన్ని నిజాన్ని బయటపెట్టనివ్వలేదు. తనకు కొద్దిగా ఆస్తిపాస్తులున్నాయని, ప్రతినెల డబ్బు పంపేది తల్లిఅని యక్ష ప్రశ్న లడిగినవారందరికీ సమాధానం ఇచ్చాడు. కాలేజీలో అతన్ని అందరూ గౌరవించారు; ప్రేమించారు. ప్రతి సబ్జక్టులోనూ అతనే ముందంజ. లెక్చరర్లకుకూడా అతనంటే వల్లమాలిన అభిమానం.

సెలవు దొరికినప్పుడల్లా అన్నయ్యను చూసేవాడు. అతని ఆరోగ్యం క్రమంగా క్షీణించటం రవణ కనుక్కోలేకపోలేదు. అందుకు కారణం తనేనని కుమిలిపోయాడు. స్కాలర్‌షిప్ వచ్చినా, కాలేజీ చదువుకు బోలెడు అదనపు ఖర్చు లుంటాయి. అందుకు డబ్బు కావాలంటే అన్నయ్య శక్తికిమించి పనిచేయక తప్పదు. పార్ట్ గూళ్లల్లోకూడా పని ఒప్పుకుని కాలానికి విలువ లేకుండా చేశాడు.

బాయ్ తలనొప్పిమాత్ర తీసుకువచ్చాడు. రవణ కాఫీ కలుపుకున్నాడు.

అన్నయ్య పంతం మరి రెండేళ్ళు ఎదిగింది.

విశ్వవిద్యాలయంలో మొదటివాడుగా ఎం. ఎ. పాసయ్యాడు.

మోటారుకార్లు ఉత్పత్తిచేసే ఒకానొక సంస్థ ఉన్నత పదవిని బాధ్యతతో నిర్వహించేందుకు తగినంత ఇవ్వతగ్గ విద్యార్థి కావాలని విశ్వవిద్యాలయానికి రాసింది.

రవణ పేరు తిరుగు టపాలో వెళ్లింది.

ఇంటర్వ్యూకూడా జయప్రదమైంది.

తను తల్లికి ఒక్కడే కొడుకని పేర్కొన్నాడు!

ఆ కంపెనీలో ఆఫీసరు ట్రెయినీగా ఎన్నుకున్నారని తెలిశాక అన్నయ్య తమ్ముణ్ణి ఆప్యాయంగా కౌగిలించుకుని ఆనందబాష్పాలు రాల్చాడు.

ఆరునెలల ట్రెయినింగ్ పూర్తిఅయ్యాక ఎనిమిదివందల జీతంతో జీవితం ప్రారంభించాడు.

పరమానందం కొడుకు పెద్దవాడై ప్రయోజకుడవటంతో వంటపని మానుకుని, అన్నయ్యకు పట్టాభిషేకంచేశాడు.

రెండునెలలు గడిచాయి. రవణ మనసు విప్పాడు.

"అన్నయ్యా! . . . ఇంతకాలం నేను నీ మాటలు విన్నాను ... శిరసా వహించాను. ఇప్పుడు నువ్వు నా మాటలు వినితీరాలి."

"ఏమిటోయ్ అది! . . . పెళ్లిచేసుకోమనా? . . . చూద్దాంలే!"

"పెళ్లిసంగతి తరవాత ఆలోచిద్దాం. నువ్వింక ఈ వంటపనికి గుడ్‌బై కొట్టేయ్. నీ అభిలాష ననుసరించి నేను జీవితంలో స్థిరపడ్డాను. నీకు ఏ బెడదా ఉండదు.

మన మింక హాయిగా ఉండచ్చు."

"అంటే నన్ను గోళ్ళు గిల్లుకుంటూ కూర్చో మంటావా? . . . ఇంకా నలభై నిండలేదుగా నాకు?"

రవణలో సహనం నశించింది.

"అన్నయ్యా! ఎప్పుడూ నీ అభిప్రాయం నీదేకాని, ఎదటివారిని నువ్వు అర్థంచేసుకోటంలేదు. నీకు ముసలితనం రాలేదని ఒప్పుకుంటాను. కాని, హాయిగా ఆడుతూ పాడుతూ కష్టమంటే ఏమిటో తెలియక చదువుకోవలసిన కాలంలో నువ్వు పొయ్యిదగ్గిర చెమటలు కక్కుతూ, మనసును అభిమానాన్ని చంపుకుని రాత్రింబగళ్ళు పనిచేశావు. అది తల్చుకుంటే నా గుండె నెవరో పిండుతున్నట్టనిపిస్తుంది. ఇకనైనా నువ్వు అందరిలాగే సుఖంగా జీవించాలనే నా కోరిక. ఒక్కనాడైనా నువ్వు నిండుగా ఉండలేదు. నాన్న పోయినప్పటినించి ఆ గరిటె చేతబట్టుకుని పరమానందంవెంట దీనంగా నడుస్తూపోయావు. అప్పటికి నాకు మంచిచెడ్డలు తెలియని వయస్సైనా, నిన్ను తల్చుకుని ఏడ్చాను. ఇప్పుడు మరింత బాధపడుతున్నాను. ఒకసారి నీ రూపం అద్దంలో చూసుకో. మాసిన పంచె, పెరిగిన గడ్డం, శుష్కించిన శరీరం ... అచ్చం ఆ పరమానందంలా ఉన్నావు. ఇవన్నీ నేను సహించలేను, అన్నయ్యా! స్కూల్లో అందరూ నన్ను లడ్డూలు, జిలేబీలు తెమ్మని ఏడిపించేవారు. ప్రాణాన్ని అయినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న అన్నయ్య ఉన్నాడని చెప్పుకోటానికి కాలేజీలో సిగ్గుపడ్డాను. వద్దు, అన్నయ్యా, వద్దు. నువ్వు నాలాగే ఉండాలి . . . గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోమనను. ఏదైనా వ్యాపారం చేయవచ్చు. ఏదైనా ఏజెన్సీ తీసుకో. వంటపని వద్దు."

రవణ ఏడవ నారంభించాడు.

అమ్మ ఎప్పటికిమల్లే మౌనంగా వింటూ నిలబడింది.

అన్నయ్య వెంటనే జవాబు చెప్పలేదు. ఏదో ఆలోచిస్తూ అటూ ఇటూ పచార్లు చేయసాగాడు. అతని మనసులో అగ్నిగోళం బ్రద్దలవుతూందని ఎవరూ గ్రహించలేదు. ఒకటి రెండుసార్లు రవణకేసి సూటిగా చూశాడు. అతనికి భయంవేసిందికూడా.

"నువ్వు ఏ మాటా అనకుండాఉంటే నా కెలాగో ఉందిరా! రవణ మాటలు విన్నావు కదా! వాడు చెప్పినట్టు చేయటం మంచిది" అని అమ్మ సమర్థించింది.

"అన్నయ్యా! . . . నే నేమన్నా తప్పుగా అంటే క్షమించు. మనసులోమాట దాపరికంలేకుండా అన్నాను."

అన్నయ్య చివరకు నవ్వాడు.

"లేదు, రవణా! నీ మాటల్లో అబద్ధం అణువైనా లేదు. నీ అభిప్రాయం బాగా అర్థంచేసుకున్నాను. ఆలోచించి చెబుతాను."

కాబిన్ డోర్ కిర్రుమంటూ తెరుచుకుంది.

"సెమినార్‌కు బయలుదేరటానికి అరగంట వ్యవధి మాత్రమే ఉంది. దానికి సంబంధించిన కాగితాలు మీరు చూడనేలేదు" అంటూ సెక్రటరీ ఓ ఫైలు అతని ముందుంచాడు.

"సరే!...చూస్తాను. పదిహేను నిమిషాలు పోయాక జ్ఞాపకంచేయి" అంటూ మరోసిగరెట్టు ముట్టించాడు.

సెక్రటరీ వెళ్ళిపోయాడు.

ఆ తరవాత నెలరోజులకు అన్నయ్య కొద్దికొద్దిగా మారుతూవచ్చాడు. తనతో మాట్లాడటం తగ్గించాడు. రెండుమూడు రోజులు వరసగా ఇంటికి వచ్చేవాడుకాడు. రవణ కిదంతా అయోమయంగా కనిపించింది. ఎప్పుడూ నవ్వుతూ సరదాగా కబుర్లు చెప్పే అన్నయ్య రుసరుసలాడేవాడు. రవణను చూడగానే ముఖం నలుపుచేసుకుని పళ్ళు పటపట కొరికేవాడు. రవణ ఈ పరివర్తనకు కారణమేమై ఉంటుందని అమ్మ నడిగి చూశాడు. ఆమెకూడా విస్తుపోయింగా చూసింది.

ఓనాడు రవణ ఆఫీసునుండి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు.

ముందుగదిలో దీపాలు లేవు.

వంటింట్లోనించి అన్నయ్య కంఠం వినపడింది.

"అవును . . . ఆనాటి వాడి ఉపన్యాసం విన్నాక నాకు నిజం తెలిసివచ్చింది. నేను పట్టి తెలివితక్కువ వాణ్ణి, వెర్రివెంగళరాయుణ్ణి. వీడికోసం నా బతుకంతా పాడుచేసుకున్నాను. నాతోబాటే స్కూలు మానుకున్న ఆ వెంకట్రావుని చూడు ... ప్రతి పైసా జాగ్రత్తగా పొదుపుచేసి భూములు కొన్నాడు. ఇల్లు బాగుచేయించాడు. పెళ్లిచేసుకుని, పెళ్లాం పిల్లలతో హాయిగా ఉన్నాడు. బ్యాంకులో నాలుగువేలదాకా నిలవచేశాడని వినికిడి. నేనుమాత్రం వీడికోసం నా రక్తం ధారపోశాను. మనిషికి స్వార్థమంటూ ఉండకూడదని, మరొకరికోసం త్యాగంచేయాలన్న వెర్రి ఊహలతో గాలిమేడలు కట్టి ఎందుకూ కొరగాకుండా పోయాను. నేను గడించినదంతా జాగ్రత్తగా దాచుకుని ఉంటే, ఈపాటికి మంచి స్థితిలో ఉండేవాణ్ణి. ఏ రోగమో రొష్టో వస్తే వీణ్ణి యాచించి, చికిత్స చేయించుకోవాలి. ఛీ ... ఛీ ... ఇంక వీడితో నాకు పొత్తు కుదరదు. మంచిమాటలు చెప్పి మర్యాదగా వాణ్ణి ఇక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మను. వాడి కేలోటూ లేదు. స్వతంత్రంగా బతకగలడు. వాణ్ణి చూస్తే నా ఒళ్ళు భగభగమంటూంది. వాడి ఉనికినికూడా సహించలేను. దాన్ని అసూయ అను . . . మరేదైనా అను ... నాకు భయంలేదు. ఏమంటావ్?...నువ్వు చెబుతావా? ఆ పని కూడా నన్నే చేయమంటావా?"

రవణ కొయ్యబారిపోయాడు.

'అన్నయ్యేనా ఇలా మాట్లాడేది?...అసంభవం. అలా ఎన్నటికీ జరగదు. తను కలకంటున్నాడేమో!' కళ్లు రెండూ నులుముకుని కిటికీలోంచి చూశాడు.

అవును ... అన్నయ్యే! నూటికి నూరుపాళ్ళు నిజం! అంటే? . . .

అన్నయ్య తనను అసహ్యించుకున్నాడా? తను మంచి స్థితిలో దర్జాగా, గౌరవంగా, పుష్కలంగా డబ్బుతో హాయిగా ఉంటూంటే, పాడుపడిన గుడిలాంటి తన జీవితం జ్ఞాపకానికి వస్తూందన్నమాట! ... ఆ మాట కూడా నిజమే!


"ఏమిట్రా ఇదంతా?...నాకు మతిపోతూంది. నిన్నటి దాకా రామలక్ష్మణుల్లా ఏ విభేదమూ లేకుండాఉన్నారు. ఉన్నట్టుండి ఏమిటీ పాడుబుద్ధి? ఎవరైనా ఏమైనా నూరిపోశారా? చూడు, నాయనా! బాగున్నవాళ్ళను చూస్తే కళ్లు కుడుతాయి. అది లోకపు తీరు. నీ మనసు రాయిలాంటిది కదా! దుర్బోధలు విని ఎలా మారిపో


(తరువాయి 54 వ పేజీలో)




# పాదముల దురద చర్మము దురద

మీ చర్మము యొక్క దురద, మంట మీకు పూర్తిగా అశాంతి కలిగించుచున్నదా? మీ చర్మము పగిలి, రక్తము కారుచున్నదా? పాదముల వేళ్ళసందున పగుళ్ళు ఏర్పడినవా? ఇట్టి పగుళ్ళు ఇంకనూ హెచ్చుచున్నవా? ఇట్టి చర్మ వ్యాధులను కలిగించు క్రిమి వేర్వేరు నామములతో వ్యవహరింప బడుచున్నది. మీ చర్మ వ్యాధులు పూర్తిగా తొలగుటకు అందుకు కారణభూతమైన క్రిమి సంతతిని నశింప చేయవలయును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో మొదటి పూతకే దురదతగ్గి, క్రిములు నశించి చర్మము యధా ప్రకారముగా మృదువై ఉత్తమగును. నిక్సోడెర్మ్ (NIXODERM) జయప్రదముగా దురదను పోగొట్టి, కాళ్ళ పగుళ్ళు నయము చేయుటకు తోడ్పడి తదితర గజ్జి, మొటిమలు, పిడ, కురుపులు, తామర మొదలగు శారీరక చర్మ వ్యాధులనుగూడ నయము చేయును. మీకు పూర్తిగా గుణమిచ్చి, సంతృప్తి పరచగల నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.




## అన్నయ్య

(21 వ పేజీ తరువాయి)

యావో నా కర్థంకాకుండా ఉంది. ఇప్పుడుమాత్రం మించిపోయినదేముంది?...రవణ చెప్పనే చెప్పాడుగా!... వ్యాపారం చేసుకోవచ్చని. ఈ పని మానుకుని అతను చెప్పినట్టు చేయి. ఆ వెంకట్రావుకంటె వెయ్యిరెట్లు హాయిగా ఉండగలవు'' అంటూ అమ్మ ఏదో చెప్పుకు పోయింది.

అన్నయ్య మండిపడ్డాడు.

''ఆగు...నీ హితబోధ నా కక్కర్లేదు. కొంపలు కూలినా నోరు మెదపని నువ్వు ఈమాత్రం మాట్లాడ గలిగావు. అదే చాలు. ఈ వంటవెధవను నువ్వు లెక్క చేయవని నాకు తెలుసు. ఆ ఆఫీసరుగారితో నువ్వు కూడా వెళ్ళు. ఒక్కక్షణం ఇక్కడుండక్కర్లేదు.''

వినవిని బయటికి వచ్చి గోడవారగా గడగడ వణుకుతూ నిలబడ్డ రవణను చూసి ఆగాడు.

''నువ్వు దొంగచాటుగా అన్నీ వినటం ఒకందుకు మంచిదే అయింది. లేకపోతే గ్రామఫోను రికార్డులా అంతా మళ్ళీ ఏకరువుపెట్టాలి. వెంటనే నీ మూటా ముల్లె సర్దుకుని వెళ్ళచ్చు. ఈ ఇంటిని అమ్మేసి వచ్చిన డబ్బులో సగం నీ ముఖాన పారేస్తాను. అంతవరకూ ఓపికపట్టు.''

''అన్నయ్యా!...నీకేమైనా పిచ్చెత్తిందా?''

''నువ్వు నాతో మాట్లాడక్కర్లేదు. నేను చేసిన ఉపకారానికి ఏదైనా ప్రత్యుపకారం చేయదలుచుకుంటే తక్షణం ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. మీ అమ్మనుకూడా తీసుకువెళ్ళు. నా పాట్లు నేను పడతాను.''

''రవణా! ... నే నిక్కడే ఉంటాను. నలభై ఏళ్ళుగా ఇక్కడుంటున్నాను. ఇది నా ఇల్లు'' అంది అమ్మ వంటింట్లోనించి.

రవణ నేలమీద కూలబడిపోయాడు. ఎంత ఆలోచించినా అతను చేసిన తప్పేమిటో, అన్నయ్య ఇలా ఎందుకు మారిపోయాడో అతని కర్థంకాలేదు.

''...అంతేకాదు! ఎవరితోనూ నీకో అన్నయ్య ఉన్నట్టు చెప్పుకోకు. నీ పెళ్ళికి నన్ను పిలవకు. అమ్మను కావాలంటే పిలు. నేను తిరిగివచ్చేసరికి నువ్విక్కడుండకూడదు'' అంటూ చరచరా వీథిలోకి వెళ్ళిపోయాడు.

పొంగి పొరలివస్తున్న కన్నీటిని ఆపుకున్నాడు. అన్నయ్యతో వాదించి లాభంలేదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. తన బట్టలు అవీ పెట్టెలో సర్దుకుని ఇల్లు విడిచాడు. తనలో ఇముడ్చుకోలేని సుఖదుఃఖాలు ఎదురైనప్పుడు మనిషి తన ఆలోచనా శక్తిని కోల్పోతాడు. ఆ క్షణాని కేం తోస్తే అది చేస్తాడు. అది ఎంతవరకు సరిఅయినదని, దాని పర్యవసానం ఎలాంటిదోనని కనుక్కునే శక్తి ఉండదు.

పుట్టినప్పటినించి అన్నయ్యతో ఆ ఊళ్ళో ఉండి, ఇప్పుడుమాత్రం ఒంటరిగా హోటలులో ఉండటం అతని గుండెను రంపంలా కోసింది. ఒకటి రెండుసార్లు అన్నయ్య ఎదురుపడితే ముఖం పక్కకు తిప్పుకుని ముందుకు కదిలి పోయాడు. ఒక్కొక్కప్పుడు ఇలాంటి చిక్కులు ఏ ప్రయత్నమూ లేకుండా వాటంతటవే విడి

పోతాయి. రవణ విషయంలోకూడా అంతే అయింది.

రెండు రోజుల తరవాత అతన్ని హెడ్డాఫీసుకు బదిలీచేశారు.

రవణ అన్నయ్యకు కొన్ని వందల మైళ్ళ దూరంలో విసిరివేయబడ్డాడు.

అన్నీ మరిచి కష్టపడి పనిచేశాడు. డైరెక్టర్లు అతన్ని మెచ్చుకున్నారు. నాలుగు సంవత్సరాల్లో మేనేజరయ్యాడు. మూడువేలు జీతం . . . కారు... క్వార్టర్స్ . . .

ప్రతిరోజూ నిద్రలేవగానే అన్నయ్యను తలుచుకోవటం మాత్రం మరవలేదు. నాలుగైదు ఉత్తరాలు రాశాడు కాని, జవాబు రాలేదు. తరవాత ఓ ఉత్తరం తిరిగి వచ్చింది. అన్నయ్య ఆ ఇంట్లో ఉండటంలేదని ఊహించాడు.

అనుకోకుండా రాధను చూశాడు.

వ్యాపారాభివృద్ధి నిమిత్తం ఆతనోసారి రాధ తండ్రిని చూసేందుకు వెళ్ళాడు. ఆయన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్. రవణను చూడగానే ఆయనకో అభిమానం, ఆప్యాయత ఏర్పడ్డాయి. తరుచు ఆ ఇంటికి వెళ్ళి నప్పుడల్లా రాధ కనపడేది.

మరో ఆరు నెలలకు పెళ్ళి అయిపోయింది. పెళ్ళికి అమ్మమాత్రం వచ్చింది. అన్నయ్యని గురించి అడిగాడు. ఎప్పటికిమల్లే ఉన్నాడంది. పెళ్ళి అయిన వారం రోజులకు తిరిగి వెళ్ళిపోయింది. కొడుకూ కోడళ్ళతో ఉండిపొమ్మని అందరూ బ్రతిమాలినా, ఆమె వినిపించుకో లేదు. అన్నయ్యను వదిలి ఆమె ఎలా ఉండగలదు? తనకు రాధ దొరికింది . . . కంటికి రెప్పలా కాపాడు తుంది. మరి, అన్నయ్యకు? . . .

* * *

చెయ్యి చురుక్కుమనటంతో ఆలోచనలనుండి బయటపడ్డాడు.

జ్ఞాపకంచేయటానికి సెక్రటరీ వచ్చాడు.

"అయామ్ రెడీ!...ఈ ఫైలు కారులో వెడుతూ చదవచ్చు. నువ్వుకూడా నా వెంట రా! ఏదైనా అవసర ముంటుంది" అంటూ కోటు తొడుక్కున్నాడు.

రాధకు అన్నయ్య సంగతి ఎలా తెలిసిందన్న నిజం మాత్రం దొరక్కుండా దోబూచులాడింది. అమ్మే చెప్పిఉంటుంది. ఎంతయినా కన్న కడుపు కదా! ఇద్దరు కొడుకులు కలిసిమెలిసిఉండాలన్న కోరిక ఆమెకుండదూ, మరి? . . . అసలు రాధతో తనే అన్నయ్యని గురించి అన్నీ చెప్పేవాడు. కాని బయటకు గెంటేముందు విధించిన ఆంక్ష? . . .

కారు కదిలింది.

సాయంత్రం ఇంటికి తిరిగివచ్చేసరికి హాల్లో కొత్త కంఠాలు వినిపించాయి. డ్రైవరు బ్రీఫ్‌కేస్ తీసుకువచ్చి టేబిలుమీద ఉంచాడు.

"రావోయ్, అల్లుడా! . . . ఊటీనుంచి నిన్న ఉదయం వచ్చారన్నమాట!. .ఈ సీజన్‌లో అక్కడ జన సందోహం ఎక్కువ. అవునా?" అన్నారు రాధ తండ్రి.

రాధ తల్లి కళ్ళజోడు ఓమారు సరిచేసుకుని రవణకు చిరునవ్వుతో స్వాగతం పలికింది.

"వచ్చి చాలాసేపైందా?" అని వినయంగా అడిగాడు.

"పదినిమిషాలైంది . . . అంతే! . . . పెందరాళే వచ్చినట్టున్నావు?"

సోఫాలో కూర్చున్న ఆ ముసలావిణ్ణి అతని కెవరూ పరిచయం చేయలేదు.

రాధ అందరికీ ట్రేలో కాఫీ తీసుకువచ్చింది.

"అదేమిటి? . . . మీరు నేలమీద కూర్చున్నా రేమిటి?" రాధ తండ్రిని చూసి అడిగాడు రవణ. అంతవరకూ ఆ సంగతే అతను గమనించలేదు.

"అత్తయ్యముందు సరిసమానంగా ఆయన కూర్చోరు" అంది రాధ తల్లి.

"ఆయన్ని మీ రందరూ గాభరా పెట్టేస్తున్నారు. ముందు ఆవిడ అత్తయ్య అని ఆయనకు తెలియ జేయాలి. ఆపైన ఆమె జీవిత చరిత్రను క్లుప్తంగా వివరించాలి. అప్పటికికాని నాన్న నేలమీద ఎందుకు కూర్చున్నారో తెలియదు" అని రాధ నవ్వింది.

"అత్తయ్యా! . . . అల్లుడు వచ్చాడు . . ." అని అరిచి దగ్గిరగా రమ్మని రవణకు సైగచేశారు రాధ తండ్రి. రవణ ఆమెకు చెవుడుతోబాటు, దృష్టిమాంద్యం కూడా ఉందని గ్రహించాడు. ఆమె కెదురుగా నిలబడి నమస్కరించాడు.

"వెయ్యేళ్ళు ఆరోగ్యంతో, సిరిసంపదలతో, పెళ్ళాం పిల్లలతో సుఖంగా ఉండు, నాయనా! నీ పెళ్ళికి రాలేక పోయాను . . . చూద్దామన్న పంతంమీద వచ్చాను" అంటూ దీవించింది.

రాధ తండ్రి చెప్పటం ప్రారంభించాడు.

"సరే! . . . ఇక ఆమె బయగ్రఫీ విను. అమ్మ నేను పుట్టగానే పోయింది. నాన్న పోయేసరికి నాకు పదేళ్ళు. మాది చాలా బీదకుటుంబం. ఇల్లుతప్పించి వేరే ఆస్తిపాస్తులే లేవు. ఆదుకునే బంధువు లెవరూ లేరు. గత్యంతరం లేక అత్తయ్య ఓ వకీలుగారి ఇంట్లో వంటలక్కగా కుదిరింది. కష్టపడి పనిచేసి నెలకు ముప్ఫయి రూపాయలు సంపాదించేది. దాంతో స్కూలు జీతం, తిండి, బట్టలు అన్నీ గడుపుకునేవాణ్ణి. స్కాలర్ షిప్‌మీద చదువుకుని ఎలాగో పైకి రాగలిగాను. అందుకే ఆమె మాకు దైవంతో సమానం . . . ఆ గౌరవంచేత ఆమె ముందు సరిసమానంగా కూర్చోలేను. ఇదంతా వెర్రివేషమని కొందరనవచ్చు. కాని, పూర్తిగా నిజం."

"అత్తయ్యా! . . . పాలు తీసుకోండి" అంది రాధ.

"మీ నాన్న ఏమంటున్నాడు? ఎప్పటికిమల్లే నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నాడా? తన అత్తయ్య ఓ వంటలక్కని చెప్పుకోటం సిగ్గుచేటురా — మనం లోకువైపోతాం — అని ఎన్నిసార్లు చెప్పినా వాడికి తల కెక్కడంలేదు. వట్టి వెర్రినాయన!" అంది అత్తయ్య.

రాధ రవణను చూసింది. అతని కర్థమయింది. కాలే జీలో చదివేటప్పుడు, తరవాత ఎన్నో సందర్భాలలో అన్నయ్య వంటవాడని చెప్పుకోటానికి సిగ్గుపడి, తల్లికి తను ఒక్కడే కొడుకని చెప్పుకున్నాడు.

"నా దృష్టిలో అలా అనటంలో తప్పేమీలేదు. న్యాయానికి కట్టుబడి చేసే ఏ వృత్తి అయినా గౌరవ ప్రదమయినదే. హెచ్చు తగ్గులు మనం కల్పించుకునేవి. తలతన్నేవాణ్ణి తాడతన్నేవాడుంటాడు. ఓ ఉదాహరణ. గుమాస్తాను చూసి ఆఫీసరు 'ఛీ . . . వాడు వట్టి గుమాస్తా' అని వెక్కిరిస్తాడు. అలాగే పెద్ద ఆఫీసరు చిన్న ఆఫీసర్ని చూసి 'వాడొక పెట్టీ ఫెలో' అంటాడు. ఆకాశంవరకూ మెట్లుంటూ ఉంటే, పైమెట్టుకు కిందిమెట్టెప్పుడూ లోకువే. అలా అని నాలుగు మెట్లు పీకిపారేయండి . . . నిచ్చెనంటూ ఉండదు. అత్తయ్యను చూసి నేను గర్వపడుతున్నాను" అన్నారు రాధతండ్రి.

ఆ తరవాత వాళ్ళేం మాట్లాడుకున్నారో అతనికి తెలియదు. అందర్నీ సాగనంపాక, తన గదికిపోయి వెక్కివెక్కి ఏడ్చాడు. అన్నయ్యను తనెప్పుడూ అసహ్యం చుకోలేదు... అతని వృత్తిని చూసి జడుసుకున్నాడు. ఆ బంధంనుండి అన్నయ్యను విడిపించాలని ప్రయ త్నించాడు. కాని తన్ను తరిమికొట్టాడు. 'కాదు . . . నీ గుండెమీద చేయివేసుకుని నిజంచెప్పు. అన్నయ్యని గురించి నలుగురితో చెప్పుకునే ఔదార్యం నీకు లేదు. రాధ ఆ ప్రసక్తి తేగానే, తేలు కుట్టిన దొంగలా పరిగె త్తావు. అన్నయ్య వెళ్ళిపొమ్మనగానే ఎందుకు వచ్చావు?



జలదేవత (ఊటీ)
ఫోటో — కె. గోపాలకృష్ణమూర్తి (దాపెట్ల)

అతని మనసులో ఏముందని ఎనుక్కునేందుకు కనీసం ప్రయత్నించనన్నా లేదు. పెళ్లికి వచ్చితీరాలని ఎందుకు మొండికెత్తలేదు? నీ మనసు స్వచ్ఛమైంది కాదు. సగం స్వార్థం . . . అర్థంలేని ఆత్మాభిమానం!'

ఎవరో అలా అడిగినట్టనిపించింది రవణకు.

"కాదు . . . కాదు . . . అన్నయ్య నా దేవుడు!" అనుకున్నాడు.

ఎవరో వచ్చే అలికిడైతే కళ్ళు తుడుచుకుని నిలబడ్డాడు.

"మీరిక్కడున్నారా? ఆ మూడుగదులూ వెతికాను. రండి . . . రండి . . . అత్తయ్య . . . అంటే మీ అమ్మగారు వచ్చారు... మరో సంగతి. . . విని మూర్ఛ పోకండి. మీ అన్నయ్యకూడా ఉన్నారు" అంది రాధ.

రవణ ఇంకేమీ వినిపించుకోలేదు.

"అన్నయ్యా!" అంటూ పరిగెత్తాడు.

హాల్లో అన్నదమ్ములిద్దరూ ఒకర్ని ఒకరు ఆప్యా యంగా కావలించుకున్నారు. కొంచెందూరంలో నిలబడి ఇదంతా గమనిస్తున్న రాధ చాటుగా కళ్ళు తుడుచు



అన్ని షాపులలో అమ్మబడును
డిస్ట్రిబ్యూటర్లు:—
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ మార్టు
రేపల్లె, గుంటూరు జిల్లా.
11-42-45, రాంగోపాల్ వీధి, విజయవాడ-1
595, పతంగి బిల్డింగ్సు, సిద్దింబజార్,
హైదరాబాద్; 12/62, మెయిన్‌రోడ్డు, వరంగల్.









కుంది. రవణ తల్లి ప్రయాణపు బడలికతో నేలమీద కూర్చుంది.

అన్నయ్య మరింత సన్నబడ్డాడు. వయసు నలభై దాటినా, మరో పది కలిపినట్టు కనిపించాడు. అదే పంచె, గళ్ళచొక్కా. పక్కనే అతనికిమల్లే రంగుపోయిన ట్రంకుపెట్టె, దుప్పటితో కట్టిన బెడ్డింగ్, నూనె మరకలు పడ్డ రెండు ముతక సంచీలు.

ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు. ఎవరికీ నోట మాట రావటంలేదు.

రాధ బిస్కట్లు, కాఫీ తీసుకువచ్చింది.

"తమ్ముడూ! . . ." అన్నాడు. 'రవణా!' అని సంబోధించటం అలవాటు. ఈ పిలుపులో అనిర్వచనీయమైన తియ్యదనం తొణికిసలాడింది. రవణను గర్వంగా ఆపాదమస్తకం చూశాడు.

"తమ్ముడూ! . . ." అన్నాడు మళ్ళీ.

"ఏం అన్నయ్యా? వస్తున్నట్టు ఉత్తరం రాయకూడదూ? . . . కారుతో వచ్చేవాణ్ణి."

"నే నెందుకు వచ్చానని ఆశ్చర్యపోతున్నావు కదూ?"

"అదంతా తరువాత మాట్లాడుకోవచ్చు. వేణ్ణీళ్ళు సిద్ధం. స్నానానికి వెళ్ళండి" అంది రాధ.

"అవునన్నయ్యా! . . . ముందు కాఫీగ్లాసు ఖాళీ చెయ్యి."

* * *

రాత్రి భోజనాలయ్యాక కబుర్లు చెప్పుకుంటున్నారు.

"తమ్ముడూ! నేను ఉన్నట్టుండి ఎందుకు మారిపోయానో ఇప్పటికైనా కనుక్కోగలిగావా?..."

"లేదన్నయ్యా! అదొక పొడుపుకథలా ఉంది."

"గుర్తుకు తెచ్చుకో. నీ వైభవం చూద్దామని ఓ నాడు ఆఫీసుకు వస్తే ఒకరిద్దరు నేనెవరని అడిగారు. నాకు వినిపించనట్టు, ఎవరో తెలిసిన మనిషి అని గుసగుసలాడావు. ఆఫీసు సంగతులు మాట్లాడేందుకు ఒకరిద్దరు వ్యాపారస్థులు ఇంటికి వస్తామంటే వద్దని, ఆఫీసుకు రమ్మన్నావు. అందరితోనూ నువ్వు ఒక్కడివే కొడుకునని చెప్పుకున్నావు. ఇలాంటివి ఎన్నో... వీటిని బట్టి నీ అభిప్రాయం నేను ఊహించగలిగాను. అన్నయ్య వంటవాడన్న నిజం బయటపడుతుందేమోనని భయపడ్డావు... లోలోన కుంగిపోయావు. ఆ బాధను బయటపెట్టేందుకు ధైర్యం లేదు. నేను ఎప్పుడూ నీ సుఖం కోరతాను. నీ మనసు రవంతైనా చివుక్కుమంటే నేను సహించలేను. ఈ పరిస్థితుల్లో నిన్ను నా నుండి దూరంచేసుకోవటంతప్పించి వేరే మార్గం కనిపించలేదు. అందుకే ఆనాడలా నటించవలసి వచ్చింది. అంతేకాని, వెర్రితమ్ముడూ, నీమీద నాకు కోపమేమిటి? నువ్వు నా ప్రాణంకంటె ఎక్కువ... ఇప్పుడైనా రాకపోదును. కాని నిన్ను చూడాలనిపించింది. ఈ అయిదు సంవత్సరాలూ నిన్ను చూడకుండా ఎలా ఉండగలిగానో నాకు తెలియదు. ఏదో గొప్పశక్తి నన్ను అణిచిఉంచిం దనుకుంటాను."

రవణ చిన్నపిల్లాడిలా ఏడవ నారంభించాడు.

"ఈ సంగతంతా అత్తయ్య నాకు ముందే చెప్పారు. కాని రహస్యంగా ఉంచుతానని మాటిచ్చాను" అన్నది రాధ.

రవణ చటుక్కున అన్నయ్య కాళ్ళదగ్గిర కూర్చుని "అన్నయ్యా! నువ్వు నా దైవం!" అన్నాడు. ★